సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



సోమశిలకు పెరుగుతోన్న వరద

సోమశిల: జలాశయం ఆదివారానికి 37.59 టీఎంసీలకు చేరుకుంది. 19,750 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 6 వేలు, కావలి కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,870
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,695
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,896
నవర (8 గ్రాములు)	రూ.55,168



వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 63 శాతం ఉంది.

న్యూస్‌రీల్

అన్ని విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు(దర్గామిట్ట)/నెల్లూరు (టౌన్): రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పలుచోట్ల వరద నీరు ఆయా ప్రాంతాలను ముంచెత్తుతోంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా సీఎం చంద్రబాబు ఆదేశాలతో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలల విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈఓ రామారావు పేర్కొన్నారు.

నిలిచిన చేపల వేట

• శాంతించని సముద్రం



కృష్ణపట్నం వద్ద ఒడ్డున కట్టేసిన బోట్లు

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఉత్తరాంధ్ర వద్ద తీరం దాటినప్పటికీ సముద్రం శాంతించలేదు. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. రెండు రోజులుగా మారిన పరిస్థితుల కారణంగా వేటకు విరామం ప్రకటించి, ఇళ్లకే పరిమితమయ్యారు. నేలటూరు, కృష్ణపట్నం, ముత్తుకూరు, ఈపూరు పట్టపుపాళెం, మిట్టపాళెంకు చెందిన మత్స్యకారులు తమ పడవలు, వలలను తీరంలో భద్రపరిచి, విశ్రాంతి తీసుకొంటున్నారు. సముద్రంలో ప్రశాంత వాతావరణం ఏర్పడిన తర్వాత వేట ప్రారంభిస్తామని కాపులు వెల్లడించారు.

ఫ్లై ఓవర్‌పై రాకపోకలు ప్రారంభం



బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం వద్ద టీ ఆకారంలో నిర్మించిన ఫ్లై ఓవర్ వంతెనపై ఆదివారం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. జూలై 14న వంతెనపై కొంత భాగం కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ బ్రిడ్జి మీదుగా ఆత్మకూరు, కావలి వైపు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి కుంగిపోయిన సమయంలో అదృష్టవశాత్తు ప్రయాణికులకు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న అధికారులు, పోలీసులు బ్రిడ్జిపై రాకపోకలను జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి బ్రిడ్జిని మూసివేశారు. ఒకటిన్నర నెల పాటు కుంగిన బ్రిడ్జికు మరమ్మతు పనులు పూర్తి చేసిన అధికారులు ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం ఇరు వైపులా ఏర్పాటు చేసిన బారికేడ్లు తొలగించి రాకపోకలను అనుమతించారు. ఒకటిన్నర నెల పాటు ఇబ్బందులు పడిన ప్రయాణికులు ఆదివారం నుంచి ఫ్లైఓవర్‌పై ప్రయాణాలు సాగించారు.

విపత్తుల నిర్వహణ నిపుణులుగా అవకాశం



కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి యంగ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ ఫెలోషిప్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని కలెక్టర్ ఓ ఆనంద్ ఆదివారం తెలిపారు. విపత్తుల నిర్వహణలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు చేసిన 35 ఏళ్లలోపు వారికి ప్రత్యేకమైన అభ్యాసన కార్యక్రమాన్ని అందించడమే లక్ష్యంగా మూడేళ్ల వ్యవధి ఉండే ఈ ప్రోగ్రాంను రూపొందించినట్లు పేర్కొన్నారు. తద్వారా మరింత మంది విపత్తు నిర్వహణ నిపుణులను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఏడాదికి 400 మంది చొప్పున రెండేళ్లలో 800 మంది సమర్థులైన వారిని గుర్తించి విపత్తు నిర్వహణలో కొనసాగించేలా ఫెలోషిప్ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి వివరాలను త్వరలోనే ఎంప్లాయిమెంట్ న్యూస్ పత్రికలో ప్రచురిస్తారన్నారు. అర్హులు విపత్తు నిర్వహణ నిపుణులుగా తయారయ్యేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.


నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు.

నెల్లూరుకు చెందిన కె.గురవమ్మకు ఇటీవల తలలో నరాల సమస్య తలెత్తి పక్షవాతం లక్షణాలు కనిపించాయి. ఆమెను వైద్యం కోసం స్థానిక దర్గామిట్టలోని జీజీహెచ్‌లో అడ్మిట్ చేశారు. చికిత్స పూర్తయ్యాక ఆమెను డిశ్చార్జి చేసి 20 రోజులు కావస్తోంది. విశ్రాంతి సమయంలో ఎలాంటి పనులు చేయలేరు. కాబట్టి బతుకుదెరువు మందుల కోసం కలిపి రూ.30 వేలు ఆరోగ్య ఆసరా కింద గురవమ్మ బ్యాంకు ఖాతాలో జమ కావాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు జమ కాలేదు. నిధులు ఎప్పుడు విడుదలవుతాయో అర్థం కాని పరిస్థితి.



అల్లూరు మండలానికి చెందిన మంగమ్మ డయాబెటీస్‌తో బాధపడుతోంది. ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చాయి. పేదరాలైన ఆమెను చికిత్స కోసం గత నెలలో నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో చేర్చారు. వైద్యం అనంతరం 20వ తేదీ డిశ్చార్జి చేశారు. ఆరోగ్య ఆసరా కింద ఆమె ఖాతాలో రూ.15,075 జమ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు నగదు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. దీంతో ఆమె ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థి ఇబ్బందులు పడుతున్నానంటూ వాపోయింది. కొంత మందికి వారి చికిత్సను బట్టి రూ.5 వేలు జమ అవుతాయి. ఇలాంటి వారందరూ సకాలంలో ఆసరా నిధులు అందక ఇబ్బంది పడుతున్నారు.



ఆసరా నిధులు వస్తున్నాయి

ఆసరా నిధులు వస్తున్నాయి. అయితే అవి రోగుల ఖాతాలకే నేరుగా జమ అవుతాయి. ఆసరా డబ్బులు జమకావడం లేదని ఎవరైనా తన దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తా.

– డాక్టర్ చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

గత ప్రభుత్వంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా లబ్ధిదారులు

ఏడాది	రోగులు	జమ చేసిన నిధులు
2019-20	6,671	రూ 4.11 కోట్లు
2020-21	18,565	రూ 10.42 కోట్లు
2021-22	33,863	రూ 16.94 కోట్లు
2022-23	39,888	రూ 22.39 కోట్లు
2023-24	7,145	రూ 3.816 కోట్లు

ఆరోగ్య ఆసరాకు ఎసరు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల వైద్యానికి, బతుకుదెరువుకు పెద్దపీట వేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో సంపాదించే వ్యక్తులు శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకునే సమయంలో అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటారు. రోజు గడవడం కూడా కష్టంగా మారే పరిస్థితుల్లో ఆ కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని 2019 డిసెంబర్ 2న ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్ష మందికిపైగా ఈ పథకం కింద ప్రయోజనం లభించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఆసరాను అటకెక్కించింది. దేశానికే ఆదర్శంగా, పేదలకు సాయంగా నిలిచిన ఈ పథకానికి మంగళం పలుకుతోంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికీ మంగళం

- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- డిశ్చార్జి అయిన రెండు రోజుల్లోనే ఆసరా నిధులు
- జిల్లాలో 1,06,132 మందికి లబ్ధి
- గత ఐదేళ్లలో రూ.57.67 కోట్ల సాయం
- కూటమి ప్రభుత్వంలో 25 రోజులవుతున్నా ఖాతాల్లో జమకాని నగదు



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగులను డిశ్చార్జి చేస్తున్న డాక్టర్లు

నెల్లూరు (అర్బన్): వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా రాష్ట్రంలో ప్రారంభించారు. పేదలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్లు చేయించుకున్నప్పటికీ కొంత కాలం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో కూలి పనులకు వెళ్లలేక పేదలు అప్పులు పాలవకుండా విశ్రాంతి తీసుకునే సమయంలో పౌష్టికాహారం, ఇతర మందుల కోసం శస్త్రచికిత్సను బట్టి నగదు చెల్లించాలని భావించింది. విశ్రాంతి భృతి కింద డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని 1,536 వ్యాధులు, శస్త్ర చికిత్సలకు అమలు చేసింది. డిశ్చార్జి అయిన 48 గంటల్లోనే నగదును నేరుగా రోగుల బ్యాంకు ఖాతాలో జమ చేసేది.

నీరు గారుస్తున్న నేటి ప్రభుత్వం

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి కూడా క్రమేపి గ్రహణం పట్టిస్తోంది. గతంలో రోగి డిశ్చార్జి అయిన రెండు రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాలో జమవుతుంటే ఇప్పుడు 20 నుంచి నెల రోజులు గడుస్తున్నా నగదు జమ కావడం లేదు. మిగతా పథకాల మాదిరిగానే ఆరోగ్య ఆసరా పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం అటకెక్కించిందని రోగులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో నెట్ వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద 132 ఆస్పత్రులను రిజిస్టర్ చేశారు. వాటిలో 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, 2 ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా ఆస్పత్రి, ఒక సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటిని కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. 28 డెంటల్ ఆస్పత్రులతో పాటు కార్పొరేట్, ప్రైవేట్‌లో 36 ఆస్పత్రులను ఆరోగ్యశ్రీ నెట్ వర్క్‌లో చేర్చారు. నూటికి 85 శాతం రోగులు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే చికిత్స పొందుతున్నారు. ఈ ఆస్పత్రుల్లో ప్రతి రోజు కొత్తగా రోగులు చేరుతుంటారు. డిశ్చార్జి అయిన వారికి 25 నుంచి 30 రోజుల వరకు నగదు జమ కావడం లేదు. నెల్లూరు పెద్దాస్పత్రిలోనే ఇలా 900 మంది వరకు ఆరోగ్య ఆసరా నిధులు కోసం ఎదురు చూస్తున్నారు. ఇకనైనా పాలకులు తక్షణమే స్పందించి ఆరోగ్య ఆసరా నిధులు గతంలో మాదిరిగానే ఒకటి రెండు రోజుల్లోనే విడుదల చేయాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జిల్లాలో 1,06,132 మంది లబ్ధిదారులు

గత ప్రభుత్వంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద లక్షలాది మంది రోగులకు విశ్రాంతి సమయంలో ఆర్థిక కష్టాలను అధిగమించారు. గత ఐదేళ్లలో జిల్లాలో 1,06,132 మందికి లబ్ధి చేకూరింది. వారి ఖాతాల్లో రూ.57.67 కోట్లు జమయ్యాయి.

రాజన్న..

మరుపురాని జ్ఞాపకం

వైఎస్... రాజశేఖరరెడ్డి.. ఆ పేరు వినగానే జనం గుండెల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. మోముపై చెరగని చిరునవ్వు. తెలుగుదనం ఉట్టిపడే పంచెకట్టు. నడకలో రాజసం.. నమ్ముకున్న వారిని ఆదరించే గుణం. పేరు పెట్టి పలకరించే తత్వం.. మాట తప్పని మడమ తిప్పని నైజం.. రైతులు, కార్మిక, కర్షకుల కోసం పరితపించే గుణం ఉండడమే అందుకు కారణం. ఈ లక్షణాలన్నీ కలగలిపిన మహామనీషి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. అవకాశం వస్తే అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు ఎలా పెట్టించవచ్చో చేసి చూపించిన ప్రజానాయకుడు. ముప్పై ఏళ్ల రాజకీయ జీవితంలో రాష్ట్ర ప్రజానీకం ఆయన్ను వెన్నంటే నిలిచి ప్రోత్సహించారు. అందుకు తగ్గట్టుగానే ఉమ్మడి రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా పయనింపజేశారు. అలంకరించిన పదవులకు సైతం వన్నె తెచ్చిన నాయకుడు. నమ్ముకున్న సిద్ధాంతం ప్రకారం ప్రజల ముందుకు రచ్చబండకు వెళ్తూ 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ దుర్ఘటనలో మృతి చెందారు. నేటికీ (సోమవారం) పదిహేను ఏళ్లు పూర్తయినా మరుపురాని జ్ఞాపకంగా ప్రజల మదిలో నిలిచిపోయారు.




- ఉదయగిరికి వస్తూ.. శాశ్వతంగా దూరమయ్యారు
- నేడు వైఎస్సార్ 15వ వర్ధంతి

ఉదయగిరి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఉదయగిరితో వీడని బంధం ఉంది. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న తపనతో సాగునీటి ప్రాజెక్ట్‌ల కల్పనకు రూపకల్పన చేసి ఈ ప్రాంత అన్నదాతల హృదయాల్లో పదిలమైన స్థానం సంపాదించారు. మోడుబారిన జీవితాల్లో సాగునీటి వెలుగులు నింపేందుకు ప్రయత్నించారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని కన్నీళ్లు తుడవాలన్న తపనే ఆయనలో నిత్యం కనిపించేది. ఆ నేపథ్యంలో ఉదయగిరి ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు హెలికాప్టర్‌లో వస్తూ ప్రమాదవశాత్తు ఆ నేత మరణించినా ఆయన జ్ఞాపకాలు మాత్రం ఈ ప్రాంత వాసుల్లో నేటికీ చెక్కుచెదరలేదు. ఉదయగిరి నియోజకవర్గానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. మేకపాటి సోదరులకు వైఎస్‌తో ఉన్న సన్నిహిత సత్సంబంధాలతో ఈ ప్రాంతం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. బీడు బారిన భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేశారు. సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చేశారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయరు పనులు 2018 డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉన్నా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కాలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగొండ ప్రాజెక్ట్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రెండు టన్నెల్‌లు పూర్తి చేసి ప్రాజెక్ట్‌కు ఒక రూపు తెచ్చి పారంభోత్సవానికి సిద్ధం చేశారు. అయితే 2024లో ప్రభుత్వం మారడంతో ప్రారంభోత్సవాన్ని జగన్‌మోహన్‌రెడ్డి చేయలేకపోయారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఉదయగిరి బీడు భూములకు వెలుగొండ ప్రాజెక్ట్ నీరు వచ్చేవి. కానీ అధికారంలోకొచ్చిన టీడీపీ ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని ఈ ప్రాంత వాసులు ఆకాంక్షిస్తున్నారు. ఇది పూర్తయితే జిల్లాలో వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం సాగు నీటిపరంగా సస్యశ్యామలం అయ్యే అవకాశముంది. వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉంటే ఈ పాటికి వెలుగొండ జలాలు ఉదయగిరి వచ్చేవని ఈ ప్రాంత వాసులు చర్చించుకుంటున్నారు. ఆయన మరణంతో ఉదయగిరి మెట్ట భూములు బీళ్లుగానే మిగిలిపోయాయి. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించినప్పటికీ నియోజవర్గానికి ఆయన చేసిన మేలు ప్రజల మనస్సుల్లో నిత్యం జ్ఞాపకంగా మిగిలారు. ఉదయగిరి ముఖద్వారం వద్ద ట్యాంక్‌బండ నిర్మాణా నికి నిధులు మంజూరు వైఎస్సార్ హయాంలోనే జరిగింది.

రచ్చబండకు వస్తూ..

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా తాను అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ప్రజల మధ్య రచ్చబండ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొట్టమొదటి రచ్చబండ ఉదయగిరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి బయల్దేరిన వైఎస్సార్ గమ్యానికి చేరకుండానే అర్థాంతరంగా హెలికాప్టర్ ప్రమాదంలో ప్రజలకు దూరమయ్యారు. వైఎస్సార్ పేరు తలుచుకున్న ప్రతి సారి ఆనాటి ఘటన ఇప్పటికీ ప్రజలు మరిచిపోలేకపోతున్నారు.



పెద్దిరెడ్డిపలి రిజర్వాయరు పనులు

చంద్రబాబు డైవర్షన్ పాలి‘ట్రిక్స్’

- నమ్మక ద్రోహులకు భవిష్యత్ శూన్యం
- అణగారిన వర్గాలను అక్కున చేర్చుకుంటే వెన్నుపోటు పొడిచారు
- ఏ ప్రయోజనాలు ఆశించి పార్టీ మారుతున్నారో చెప్పాలి
- రాజకీయాల్లో ఉన్నంత కాలం జగన్‌తోనే ఉంటా
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు (బారకాసు): ‘రాష్ట్రంలో పరిస్థితులు అత్యంత భయంకరంగా ఉన్నాయి. హత్యలు, దాడులతో ఒక వైపు రెడ్‌బుక్ రాజ్యాంగం, మరో వైపు పార్టీ ఫిరాయింపులు. ఆడపిల్లలకు రక్షణ, భద్రత లేకుండా పోయింది. సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు. వీటన్నింటిని డైవర్షన్ చేయడానికే సినిమా నటితో రాజకీయాలు చేస్తూ చంద్రబాబు పాలి‘ట్రిక్స్’ చేస్తున్నారు’ అంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం నెల్లూరులోని పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో గెలవలేని వారిని, అణగారిన వర్గాలకు చెందిన వారిని అక్కున చేర్చుకుని పదవులిచ్చి రాజ్యసభ, శాసనమండలికి పంపితే వాళ్లే ఈ రోజు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచి టీడీపీలోకి వెళ్తున్నారని విమర్శించారు. ఇలాంటి నమ్మకం ద్రోహులకు రాజకీయ భవిష్యత్ ఉండదని పార్టీ మారే వాళ్లు గుర్తు పెట్టుకోవాలన్నారు.

చంద్రబాబు మోసం చేస్తే.. జగన్ అందలమెక్కించారు..

ఏళ్ల తరబడి చంద్రబాబు, టీడీపీ కోసం పని చేసిన వారిని అదే చంద్రబాబు మోసం చేస్తే.. అటువంటి వారిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకుని రాజకీయంగా అందలమెక్కించారని చంద్రశేఖరరెడ్డి అన్నారు. తన సహచరుడు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి ఈ రోజు పార్టీ మారడం బాధాకరమన్నారు. బల్లి దుర్గాప్రసాద్ 30 ఏళ్ల పాటు టీడీపీలో ఉండి అనేక సేవలందిస్తే 2019 ఎన్నికలకు ముందు అదే పార్టీ ఆయన్ను పట్టించుకోలేదన్నారు. అటువంటి వ్యక్తిని గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పార్టీలో చేర్చుకుని ఎంపీగా నిలబెట్టి అత్యధిక మెజార్టీతో గెలిపించారని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు దుర్గాప్రసాద్ అకాలంగా మరణిస్తే.. ఆయన కుమారుడు కల్యాణ్ చక్రవర్తిని ఎమ్మెల్సీని చేశారన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఓడిపోయిన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు వంటి వారిని ఎమ్మెల్సీ, మంత్రిని, రాజ్యసభ సభ్యులుగా చేశారని గుర్తు చేశారు. పోతుల సునీతను ఎమ్మెల్సీని చేసి పార్టీలో ప్రాధాన్యం కల్పించారన్నారు. సామాజిక వర్గాల వారికి పెద్ద పీట వేయడమే వైఎస్ జగన్ ఆలోచన అన్నారు. అదే చంద్రబాబు దగ్గర ఉంటే గుర్తింపు ఉండదనే విషయం ఆ పార్టీ నేతలే చెబుతుంటారన్నారు. రాజీనామాలు చేస్తున్న వారంతా సీనియర్లు చెప్పే మాటలు రాజకీయంలో జూనియర్‌గా ఉన్న తన లాంటి నాయకులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. వైఎస్ జగన్ మాటకు కట్టుబడే వ్యక్తి, నిబద్ధత కలిగిన వ్యక్తి అందుకే ఇంతటి మంచి నాయకుడు వద్ద పని చేసే అవకాశం తనకు దేవుడు కల్పించాడని అనుకుంటున్నానన్నారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని, వైఎస్ జగన్ వెంటే నడుస్తానని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో లేకపోయినా.. ప్రతిపక్షంగా అయినా ఉంటాను తప్ప.. స్వార్థ రాజకీయాలు చేయబోనని చెప్పారు.

సంక్షేమం పేరుతో మోసం

ఎన్నికల్లో చంద్రబాబు అనేక హామీలిచ్చి ఈ రోజు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని, అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో తల్లులు బిడ్డలను చదివించుకునేందుకు కష్టాలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి మంది 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తానని చెప్పడంతో వారంతా చంద్రబాబుకు ఓట్లు వేశారన్నారు. గతంలో రైతు భరోసా కింద రూ.13,500 ఇస్తే చంద్రబాబు రూ.20 వేలు ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో రైతులందరూ ఎదురు చూస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి, కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, ఆర్టీసీ బస్సులో ఫ్రీ అని చెప్పి ఇప్పుడు ఆ ఊసే లేదన్నారు. ఇలా అన్ని వర్గాల వారికి ఆశ పెట్టి వారందరిని నడిరోడ్డుపై నిలబెట్టి మరో వైపు ప్రలోభాలకు గురి చేసి తమ పార్టీలోకి తీసుకునే దానిపై శ్రద్ధ పెట్టి రూ.వేల కోట్లు ఖర్చు చేయడం అనేది ఎంత దురదృష్టమో ప్రజలందరూ గమనిస్తూ ఉన్నారన్నారు.

అధికారులపై కేసు నమోదు

నెల్లూరు (క్రైమ్): హైకోర్టు ఉత్తర్వుల మేరకు గత ఐటీడీఏ పీఓ, దర్గామిట్ట సీఐలపై బాలాజీనగర్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ఎన్‌ఎస్‌టీఎఫ్‌డీసీ (నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో 2017లో కారును తీసుకున్నారు. కరోనా విపత్తు సమయంలో లోను తాలుకు నగదు చెల్లించలేకపోయారు. గతేడాది డిసెంబర్ 7న అప్పటి ఐటీడీఏ పీఓ(యానాది) ఎం.రాణి ఆదేశాల మేరకు నాటి దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావు కారును స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. దీనిపై పెంచలయ్య హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు బాలాజీనగర్ పోలీసులు సదరు అధికారులపై కేసు నమోదు చేశారు.

7న మద్యం దుకాణాల బంద్

నెల్లూరు (క్రైమ్): నూతన మద్యం పాలసీ పేరిట ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇదే జరిగితే తమ పరిస్థితి ఏమిటని ప్రభుత్వ దుకాణాల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలను బంద్ నిర్వహించాలని నిర్ణయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధినిచ్చింది. వారు ఐదేళ్ల పాటు ఎలాంటి కష్టాలు లేకుండా విధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరిట ప్రైవేట్ దుకాణాల ఏర్పాటు వైపే మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందినే కొనసాగిస్తారా లేక తొలగిస్తారా అనే విషయంపై స్పష్టత లేదు. ఒక వేళ తమను విధుల నుంచి తొలగిస్తే ఆందోళన బాట పట్టక తప్పదని వారు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నెల 7న మద్యం దుకాణాల బంద్ చేయనున్నట్లు ఏపీ స్టేట్‌బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పేర్కొంది.

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మృతుడు

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? మరే ఇతర కారణమో తెలియదుకాని రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు సౌత్‌రైల్వేస్టేషన్‌లో నెల్లూరువైపు వచ్చే రైలుపట్టాలపై ఆదివారం వేవకుజామున చోటు చేసుకుంది. మృతుడు సుమారు 30 నుంచి 35ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్, గ్రే రంగు లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి కుడిచేతిపై భవానీ అని ఇంగ్లిష్‌లో పేరు రాసి ఉంది. ప్రమాద స్థలాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై జీ మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ప్రశాంతినగర్ సెంటర్ నుంచి హైవే కు వెళ్లే రోడ్డు పక్కన డ్రైనేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. నవాబు పేట పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కాలువకు కొద్దిదూరంలో రోడ్డు పక్కన పడి ఉన్న సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సుమారు 40 నుంచి 45ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి బులుగురంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గోధుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి ఛాతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96306, 94407 96310, 94416 81962 నంబర్లను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఉలవపాడు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై కరేడు ర్యాంపు సమీపంలో శనివారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గుడ్ న్యూస్ సమీపంలో నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే మార్గంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి బులుగురంగు టీషర్టు, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

24 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు (క్రైమ్): గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లాలోని 24 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆదివారం ఎస్పీ జి.కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. వారందరూ వీఆర్‌లో రిపోర్టు చేసుకోనున్నారు. త్వరలోనే పోస్టింగ్‌లు కల్పించనున్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్సై	ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్
షేక్ మహబూబ్‌బాషా	ఇంటెలిజెన్స్
ఆర్. సుధీర్‌కుమార్	వెంకటాచలసత్రం
కె.శీనయ్య	దుత్తలూరు
షేక్ గౌస్‌బాషా	కావలి 1వ పట్టణం
షేక్ ఖాదర్‌బాషా	కొడవలూరు
ఎం. జానకిరామ్‌రెడ్డి	కావలి 2వ పట్టణం
సీహెచ్ తిరుమలరెడ్డి	దగదర్తి
షేక్ దాదాసాహెబ్	సంతపేట
వి. బ్రహ్మయ్య	దర్గామిట్ట
డి. వెంకటేశ్వర్లు	మనుబోలు
ఎన్. శ్రీనివాససింగ్	డీసీఆర్‌బీ
షేక్ ముక్తియార్‌బాషా	డీసీఆర్‌బీ
పి. శ్రీనివాసులు	తిరుపతి జిల్లా
షేక్ సుల్తాన్‌బాషా	విడవలూరు
ఎ. శీనయ్య	ఉదయగిరి
ఓ. శ్రీనివాసులు	విడవలూరు
పి. శ్రీనివాసులరెడ్డి	తిరుపతి
జీవీ సుబ్బారావు	చేజర్ల
ఎస్. నాగరాజు	కందలేరు
ఎన్. శ్రీనివాసరావు	కావలి రూరల్
యు. నాగయ్య	సంగం
కె. శివయ్య	తోటపల్లిగూడూరు
ఎం. మనోహర్‌రెడ్డి	కొండాపురం
ఎస్‌వీ శేషుబాబు	ఇంటెలిజెన్స్

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	రూ.97
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్	రూ.180
స్కిన్‌లెస్ చికెన్	రూ.200
లేయర్ చికెన్	రూ.178

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)
పెద్దవి: రూ.100
సన్నవి: రూ.50
పండ్లు: రూ.30



ప్రీస్కూల్ చిన్నారుల భవితపై నిర్లక్ష్యం

అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పాఠ్యపుస్తకాలు, కిట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రైవేట్ స్కూళ్ల వైపు మొగ్గు


గత ప్రభుత్వం అందజేసిన కిట్లతో బోధన

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ చిన్నారుల భవితను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు పునః ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రీ స్కూల్ పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. చిన్నారులకు సంబంధించి కిట్లు కూడా ఇంకా రాలేదు. దీంతో పాత పుస్తకాలు, కిట్లతోనే అంగన్‌వాడీలు బోధన కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నారుల్లో బాల్య దశలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు, ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విధానానికి మంగళంపాడింది. బాల్య దశలోనే విద్యా పరంగా గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు చిన్నారులు మళ్లే అవకాశం ఉంది. ,ప్రభుత్వ ఆలోచన కూడా అదే రీతిలో ఉందనే భావనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.


పాత పుస్తకాలతో బోధన చేస్తున్న అంగన్‌వాడీ

ఆగిన పాఠ్యపుస్తకాల పంపిణీ

గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్–1 కిట్లను అందజేసింది. దీంతో అంగన్‌వాడీల్లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల తరహాలోనే చిన్నారులకు విద్యాబోధన సాగింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1కిట్లు అందజేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు కూడా ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లు ఇచ్చారు. దీంతో వారికి బోధన చాలా సులభంగా, అర్థమయ్యే రీతిలో సాగేది. కానీ కొత్త ప్రభుత్వం పుస్తకాలకు మంగళం పాడి పాత విధానాన్ని అమల్లోకి తెచ్చే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకం

జిల్లాలో 14 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 1.39 లక్షల మంది చిన్నారులు ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 15వేల మందికిపైగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరందరికీ ఈ ఏడాది పాఠ్యపుస్తకాలు అందలేదు. దీంతో చిన్నారులకు బోధన ఆగిపోయింది. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతో అరకొరగా విద్య బోధన కొనసాగిస్తున్నారు. పుస్తకాలు లేకుండా బోధన ఎలా అంటూ పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించేందుకేనా..

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చిన్నారులు ప్రీస్కూల్‌కు ఎక్కడ చేరితే అదే విద్యాసంస్థల్లోనే విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తే చిన్నారులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో యల్‌కేజీ, యుకేజీల్లో చేరుతారు. ఆ తర్వాత కూడా ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువు కొనసాగిస్తారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది. కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇంకా పుస్తకాలు రాలేదు

అంగన్‌వాడీ చిన్నారులకు సంబంధించిన పుస్తకాలు ఇంకా రాలేదు. త్వరలో వస్తాయని అధికారులు చెబుతున్నారు. పుస్తకాలు వచ్చిన తర్వాత కేంద్రాలకు పంపుతాం. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలు ద్వారానే బోధన చేస్తున్నారు. బోధనలో ఇబ్బందులు లేవు. చిన్నారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తాం.
–హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్

గణేశ్ ఉత్సవాలకు 'సింగిల్ విండో' అనుమతులు

- గణేశ్‌ఉత్సవ్.నెట్ లేదా వాట్సప్ నంబర్ 79950 95800లో వివరాలు పొందుపరచాలి
- ఎస్పీ జీ కృష్ణకాంత్


ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వం సింగిల్ విండో విధానంతో గణేశ్ ఉత్సవ అనుమతులను సులభతరం చేసిందని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పురపాలక, విద్యుత్, అగ్నిమాపక, పోలీసు శాఖల నుంచి ఎన్‌ఓసీ పత్రాలు తీసుకోవాల్సి ఉండేదని, ఇకపై అలా తిరగాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించదలచిన వారు వాట్సప్ నంబర్ 79950 95800 లేదా గణేశ్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి, సచివాలయాల్లో చలానా రుసుం చెల్లించి అనుమతులు పొందవచ్చని తెలిపారు.

దరఖాస్తు ఇలా..

ఉత్సవాలకు అనుమతులు పొందాలనుకునే వారు వాట్సప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. అనంతరం ఫోన్‌కు లింక్ వస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత గూగుల్‌ఫారం ఓపెన్‌చేసి అందుబాటులో ఉన్న కాలమ్స్‌ను పూర్తిచేసి సబ్మిట్ చేయాలి. గణేశ్‌ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు చేస్తారు?. నిమజ్జనం ఏ రోజు? ఎక్కడ? ఏ సమయంలో చేస్తారు? ఏ వాహనం వినియోగిస్తారు? తదితర వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

అనుమతుల మంజూరు ఇలా..

దరఖాస్తులు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్తాయి. స్థానిక పోలీసు అధికారి ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బంది బృందంగా ఏర్పడి మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శిస్తారు. ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీని జారీ చేస్తారు. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేషన్ చేసి మండపంలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలని ఎస్పీ సూచించారు.

జాగ్రత్తలు పాటించాలి

ఉత్సవాల నిర్వాహకులు వలంటీర్లను ఏర్పాటు చేసుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద ఎలాంటి వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదన్నారు. నిబంధలకు అనుగుణంగా లౌడ్‌స్పీకర్లను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు వినియోగించరాదన్నారు. విధిగా ఇసుక బస్తాలు, డ్రమ్ముల్లో నీరు, అగ్నిప్రమాద నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. బాణసంచా కాల్చరాదన్నారు. రాత్రి వేళల్లో వలంటీర్లు మండపంలో నిద్రించాలన్నారు. అశ్లీల కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, వదంతులను ఎట్టిపరిస్థితుల్లో నమ్మరాదని, ఇతరులకు ఫార్వర్డ్ చేయరాదన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే 112కు లేదా స్థానిక పోలీసులకు ఫోన్‌చేస్తే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. జిల్లా ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు.

ఊరికి వెళ్లొచ్చేలోగా ఇల్లు గుల్ల

పొదలకూరు : ఊరికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో దొంగలు పడి గుల్ల చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది.పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని సుధాకర్‌రెడ్డి ఆస్పత్రికి ఎదురుగా కాకుమాని జనార్దన్ నివాసం ఉంటున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి రెండ్రోజుల క్రితం చెన్నైకు వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా కేజీ వెండి, రెండు ల్యాప్‌టాప్స్, పట్టుచీరలు కనిపించలేదు. దీంతో పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎస్‌కే ఆరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 మంది జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో ఆదివారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 14 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నంచి రూ 38,650 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ నగరంలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

6 నుంచి వేళాంగణి మాత ఉత్సవాలు

- ఆర్సీఎం బిషప్ ఎండీ ప్రకాశం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బిషప్ ఎండీ ప్రకాశం

నెల్లూరు(బృందావనం): తోటపల్లిగూడూరు మండలం కోడూరు సముద్రతీరంలో ఉన్న వేళాంగణి మాత చర్చిలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు వేళాంగణి మాత జన్మదిన మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు రోమన్ కేథలిక్ మిషన్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంతపేటలోని రోమన్ కేథలిక్ కెథడ్రిల్ (ఆర్సీఎం చర్చి)లో విచారణ గురువులతో కలిసి ఆదివారం బిషప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ ఏటా సెప్టెంబరు 8న వేళాంగణి మాత జన్మదిన ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 6న రాత్రి రక్షణ సహకారిణి సప్రమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 7న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విచారణ గురువుల ఆధ్వర్యంలో ఆరాధన, స్వస్థత ప్రార్థనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 గంటలకు దివ్యబలి పూజ, సాయంత్రం 6 గంటలకు పరిశుద్ధ జపమాల, దివ్యబలిపూజ, రాత్రి 8గంటలకు తేరు ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు ఉదయకాల ప్రార్థనలు, పరిశుద్ధ జపమాల, సమష్టి దివ్యబలి పూజలు, సాయంత్రం 6 గంటలకు వేళాంగణి మాత తేరు ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు తరలివచ్చి ఏసుప్రభువు, వేళాంగణి మాతను దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. కొత్తకోడూరు వేళాంగణిమాత చర్చి ఫాదర్ పినపాటి లూకాస్ రాజ్ మాట్లాడుతూ లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను కల్పించామన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరులోని ఆత్మకూరుబస్టాండ్ నుంచి మూడ్రోజులు ఉదయం 4 గంటల నుంచి పుణ్యక్షేత్రం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు వైడీ హృదయరాజ్, రొసారియో, పాపారావు, లూయిస్, అలెక్స్, జొహెన్నెస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులను కాపాడుకుందాం


- ఆదివాసీ దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సులో వక్తల పిలుపు


మాట్లాడుతున్న చిలుక చంద్రశేఖర్

నెల్లూరు(బృందావనం): భావితరాల మనుగడకు, దేశ ప్రగతికి తోడ్పడే సహజవనరుల సంరక్షణ కోసం తమ జీవితాలను ఫణంగా పెడుతున్న ఆదివాసులు, పర్యావరణ పరిరక్షణలో ప్రధాన భూమిక పోషించే అడవులను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ తరలిరావాలని వివిధ రంగాలకు చెందిన పలువురు మేధావులు పిలుపునిచ్చారు. నగరంలోని పురమందిరంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివాసీ దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సును ఆదివారం నిర్వహించారు. పలువురు వక్తలు పాల్గొని కార్పొరేటీకరణ–పర్యావరణ విధ్వంసం, ఆదివాసీ హక్కులు–సంఘీభావ ఉద్యమాలపై ప్రసంగించారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా దండకారణ్యంలో 'జల్–జమీన్–జంగల్' పేరుతో పర్యావరణ రక్షణ కోసం ఆదివాసులు పోరాటాలు సాగిస్తున్నారన్నారు. వారిని అడవుల నుంచి తరిమికొట్టేందుకు ఒక పథకం ప్రకారం అడవులను ధ్వంసం చేస్తూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న కుటిల పన్నాగాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. అడవుల్లోని అపారమైన సహజవనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో అనుసరిస్తున్న తీరుతెన్నులను తీవ్రంగా ఆక్షేపించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో సహజవనరుల విఘాతానికి పారిశ్రామిక విప్లవీకరణ మాటున ఆయా ప్రభుత్వాలు చేసే విధ్వంసకర చర్యలు, వాటి వల్ల కలుగుతున్న దుష్ఫలితాలు, పొంచి ఉన్న పెనుప్రమాదాలు, అంతరించిపోయిన వివిధ దేశాల సంస్కృతి, నాగరికతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చూపుతున్న ప్రభావాన్ని కూలంకషంగా వివరించారు. భావితరాల మనుగడ సాగాలంటే మానవనైజంలో మార్పులు రావాలన్నారు. సంపద ఒక్కటే ప్రధానం కాదని ప్రకృతి మనుగడ ప్రధానమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అనంతరం ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కో కన్వీనర్ జువ్విగుంట బాబు, పర్యావరణ కార్యకర్త టీ రమణయ్య ఉపన్యసించారు.తొలుత ఆదివాసీల హక్కుల రక్షణ కోసం సంఘీభావంగా ర్యాలీ చేపట్టారు. ప్రజాకళామండలి కళాకారులు ఆలపించిన అభ్యుదయ గీతాలు ఆలోచింపజేశాయి. జీ మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాస్వామ్యవాదులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం
- మహాకుంభాభిషేక పూజల్లో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి


మంత్రి, ఎంపీలతో కుంభపూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పండితులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సంగం మండలం వంగల్లులోని కామాక్షిదేవి సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేక పూజల్లో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన విశిష్టత కలిగిన భీమలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, కుంభాభిషేక పూజల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. గ్రామస్తులు, దాతలు ఆలయాన్ని పునర్నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ఏడు పెద్ద ఆలయాలతో పాటు 6ఏ కేటగిరీకి చెందిన 231 దేవాలయాల్లో ఆహ్లాదకర వాతావరణం, భక్తిభావం ఉట్టి పడేలా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆలయాల్లో రుచికరమైన, నాణ్యమైన ప్రసాదం భక్తులకు అందిస్తామని, ప్రసాదం తయారీలో ఏ గ్రేడ్ పదార్థాలను వినియోగించేలా ఆదేశాలిచ్చినట్లు చెప్పారు.

చాలా సంతృప్తిగా ఉంది : ఎంపీ వేమిరెడ్డి

తొలిసారిగా సంగం మండలం వంగల్లులో కుంభాభిషేక పూజల్లో పాల్గొనడం మనసుకు చాలా సంతృప్తిగా ఉందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆలయాలు బాగుంటే భగవంతుడి ఆశీస్సులతో అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లుతుందని ఎంపీ వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధులత, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, తహసీల్దారు సోమ్లానాయక్, ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి, దాతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.